క్లుప్తంగా

యువజన విభాగం అధ్యక్షుడిగా భాస్కరరావు



పరవాడ: మండలంలోని ఈ.బోనంగి శివారు బొద్దపువానిపాలెం గ్రామానికి చెందిన కంచిపాటి భాస్కరరావు వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించిన ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు, మండల పార్టీ సీనియర్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల పక్షపాతి వైఎస్సార్



రాజశేఖరరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

పరవాడ: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వైఎస్సార్ జయంతి సందర్భంగా రైతు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రైతు పక్షపాతి అని కొనియాడారు. మహానేత చిత్రపటానికి నివాళులర్పించారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోన రామారావు మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అవసరమైన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో ఎం.ఎస్.మూర్తి, వ్యవసాయ సహాయకులు గౌతమి, రైతులు పాల్గొన్నారు.

వెంకన్నకు విశేషంగా పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో అర్చకులు పూజలు నిర్వహించారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ వార్షికోత్సవం

ఉక్కునగరం: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 29వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఉత్తరాంధ్ర జిల్లాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగి సురేష్ మాట్లాడారు. మందకృష్ణ మాదిగ స్థాపించిన ఎమ్మార్పీఎస్ నేడు దేశంలోని అన్ని రాష్ట్రాలకు వ్యాపించి బడుగు, బలహీన వర్గాల్లో చైతన్యం తెచ్చిందన్నారు. గుండె జబ్బు పిల్లల కొరకు ఉద్యమిస్తే ప్రభుత్వం పిల్లలకు ఉచిత గుండె ఆపరేషన్లు చేయించిందన్నారు. కార్యక్రమంలో డి.సంపూర్ణం, అత్తోటి రవికుమా ర్, యు.దానమయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ఈవో శిరీష తదితరులు

దాబాగార్డెన్స్ : కనకమహలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఇటీవల జీవీఎంసీ నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు శనివారం ఆలయ ఈవో కె. శిరీష చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో శిక్షకుడు సురేష్, మాజీ ఏఈవో పి. రామారావు తదితరులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి వైఎస్సార్

- ఆయన పథకాలు దేశానికే ఆదర్శం
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- పురుషోత్తంపురంలో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు



వైఎస్సార్ జయంతి వేడుకలకు హాజరైన ప్రజలు, పార్టీ అభిమానులు



సభలో మాట్లాడుతున్న పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి.చిత్రంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తదితరులు

సింహాచలం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదలకోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన మహోన్నత ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 95వవార్డు పరిధి పురుషోత్తపురంలో వైఎస్సార్ 74వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురి దివ్యాంగులకు త్రి స్కూటర్లు అందజేశారు.ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి వేదికపై మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌తో కలిసి మహానేత రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ప్రసంగించారు. వైఎస్సార్ అంటే పేదలపాలిట పెన్నిధి అని.. పేదల వైద్యం కోసం ఆరోగ్యశ్రీని తీసుకొచ్చిన ఘనత వైఎస్సార్‌దే అన్నారు. అప్పట్లో దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఆరోగ్యశ్రీ తీసుకురాలేదని గుర్తు చేశారు. అలాగే 104,108లను ప్రవేశపెట్టారన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పారిశ్రామిక అభివృద్ధికి పునాది వేశారన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించే కార్యక్రమాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టిన ఘనత వైఎస్సార్‌దే అన్నారు.అందుకే నేటికీ వైఎస్సార్ ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నారన్నారు.

ప్రగతి పరుగులు

వైఎస్సార్ హయాంలో విశాఖ ప్రగతిలో పరుగులు పెట్టిందన్నారు. విశాఖలో బీఆర్‌టీఎస్ రోడ్డు ఏర్పాటు, స్టీల్‌ప్లాంట్‌లో సమస్యలు వచ్చినప్పుడు కేంద్రంతో మట్లాడి రుణాలు వచ్చేలా చేశారని చెప్పారు. విశాఖ విమానాశ్రయం ఇంటర్నేషనల్‌గా ఆవిర్భంచడానికి కారణం కూడా వైఎస్సార్ అన్నారు. బీహెచ్‌పీవీని బీహెచ్‌ఈఎల్‌లో విలీనంతో పాటు షిప్‌యార్డ్‌కు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేసిన ఘనత వైఎస్సార్‌దే అని తెలిపారు.

తండ్రి స్ఫూర్తితో..

తండ్రి స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని చెప్పారు. ఒక పక్క రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూనే ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి దేశంలోనే ఏపీని అగ్రగామిగా నిలబెట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు హామీలు ఇవ్వడం తప్పా అవి నెరవేర్చిన సందర్భాలు లేవని ఎద్దేవా చేశారు. డ్వాక్రా మహిళలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. సీఎం జగన్ డ్వాక్రా మహిళలకు అధికారంలోకి వచ్చిన నాటి నుంచే వారి ఖాతాల్లో నగదు జమచేయడం జరుగుతోందన్నారు.

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ రాజశేఖరరెడ్డి మరణవార్త తట్టుకోలేక ప్రాణాలు విడిచిన అభిమానుల కోసం సోనియాగాంధీని ఎదురించి నిలబడిన వ్యక్తి జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ పేదల కోసం ఒక అడుగు ముందుకేస్తే జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు అడుగులు ముందుకు వేశారన్నారు. చంద్రబాబు చెప్పిన పథకాల్లో ఒక్కటైనా ఆయన బుర్రలోంచి వచ్చి ఉంటే రాజకీయాలు వదిలేసి వెళ్లిపోతానని అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు. చంద్రబాబు మోసపూరిత హామీలు కావాలా.. ఇంటికే పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ కావాలో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు.

ఎమ్మెల్యే అన్నరెండ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ నాలుగేళ్లలో పెందుర్తి నియోజకర్గంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున పూర్తి చేశామన్నారు. టీడీపీ పాలనలో ఇచ్చిన పింఛన్ల కంటే 2019–23 లో నియోజకర్గం మొత్తం మీద 10,118 పింఛన్లు అధికంగా ఇస్తున్నామని చెప్పారు. 122 పాఠశాలలను నాడు–నేడు కింద అభివృద్ధి, రూ. 8 కోట్లతో పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాల భవనం నిర్మించామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, పెందుర్తి నియోజకర్గ ఇన్‌చార్జి అజయ్ రాజ్, రాష్ట్ర నాయకుడు భగవాన్ జయరామ్, 95వవార్డు కార్పొరేటర్ ముమ్మనదేముడు, ఎంపీపీలు మధుపాడ నాగమణి, బోకం సూర్యకుమారి, పైల వెంకటపద్మలక్ష్మి, జెడ్పీటీసీలు ఉప్పిలి దేవి, సన్యాసిరాజు, తుంపాల అప్పారావు, పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండల పార్టీ అధ్యక్షులు నక్క కనకరాజు, కర్రి బాబు, రామారావు, ఏపీ అయ్య ఎరుకుల కార్పొరేషన్ డైరెక్టర్ కనకరాజు, ఎన్ఎస్ఎంఈ డైరెక్టర్ నదియా, రాష్ట్ర హ్యూమన్ రైట్స్ సెక్రటరీ ఆశాజ్యోతి, 94,97వ వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఆదిరెడ్డి మురళి, మెంటి మహేష్ పాల్గొన్నారు.

13, 14 తేదీల్లో ప్రతిభా పోటీలు

దాబాగార్డెన్స్ : మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో కళా ఉత్సవ్ పేరిట ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్టు అకాడమీ డైరెక్టర్ మహ్మద్ షకీల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయం వేదికగా ఆ రెండు రోజులు సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు పోటీలు ఉంటాయని చెప్పారు. శాస్త్రీయ నృత్యం, కూచిపూడి, జానపద నృత్యం, వెస్టర్న్ డ్యాన్స్, సినిమా పాటలు, మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంటల్, డ్రాయింగ్, పెయింటింగ్, పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్, పెద్దలకు వస్త్రాలంకరణ, గెటప్స్ పోటీలు ఉంటాయని చెప్పారు. పోటీలో పాల్గొనదలిచే వారు 9966485335కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

మహానేతకు ఆత్మీయ నివాళి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పెందుర్తి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. మహానేత వైఎస్సార్ విగ్రహాలు, చిత్ర పటాలకు పూలమాలల వేసి ఆత్మీయ నివాళులర్పించారు. కేక్‌లు కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. పలు చోట్ల సేవా కార్యక్రమాలు చేపట్టారు.

- వాడవాడలా వైఎస్సార్ జయంతి
- సేవా కార్యక్రమాలు చేపట్టిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పెందుర్తిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



కేక్ కట్ చేసి పారీ నాయకులకు తినిపిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల, కర్రి బాబు



రాజశేఖరరెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న 93వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి సత్తిబాబు



అడవివరంలో రాజశేఖరరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కర్రి అప్పలస్వామి, వరహానరసింహం



ఆకార్ బాలికల సంరక్షణ కేంద్రంలో పిల్లలకు కేక్ తినిపిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు



పరవాడలో కేక్ కట్ చేస్తున్న సీఈసీ సభ్యుడు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పీఎస్ రాజు

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు అడవివరం మార్కెట్ ఏరియా వద్ద రాజశేఖరరెడ్డి చిత్రపటానికి అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి స్వామి, 98వవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామస్తులకు, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల అప్పలరాజు, లంక సత్తిబాబు, కర్రి సత్తిబాబు, ఆదిరెడ్డి, బొట్టా శ్రీను, తెడ్లపు మహేష్, సిరిపురపు కృష్ణ, ఎన్.అప్పారావు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 95వవార్డు సుజాతనగర్‌లోని 80ఫీట్ రోడ్డులోని ఆకార్ బాలికల సంరక్షణ కేంద్రంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు బాలికలతో కేక్ కట్ చేయించి వారికి పంచిపెట్టారు. ఉదయం అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రోమాల నూకరాజు, అత్తిలి నాగేంద్ర కుమార్, బొడ్డు దేముడుబాబు, సదాశివుని రవితేజ, అప్పలరాజు, లక్ష్మి, భవాని పాల్గొన్నారు.

పెందుర్తిలో...

సింహాచలం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పెందుర్తిలో ఘనంగా నిర్వహించారు. నాలుగురోడ్ల కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుపాడ నాగమణి, మండల పార్టీ అధ్యక్షుడు నక్క కనకరాజు, 94వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, నాయకులు బైలపూడి భగవాన్ జయరామ్, గొర్లె రామునాయుడు పాల్గొన్నారు.

సబ్బవరం మండలంలో..

సబ్బవరం: మండలంలో మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు పూలమాలులు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, మండల లక్ష్మణ, బోకం రామునాయుడు,మళ్ల కోటేశ్వరరావు,కర్రి అప్పారావు,బైలపూడి దేముడు బాబు,గొర్లి నూకరాజు,బోకం స్వామినాయుడు, మామిడి కొండాజీ,యర్రా శ్రీనివాసరావు, బంతి కోళ్ల పద్మ పాల్గొన్నారు.

- గొటివాడలోని జనరేషన్ యువ అనాథశ్రమంలో ఉన్న పిల్లలకు వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, నాయకులు ఎస్‌పీ రాజు,సేనాపతి దుర్గారావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

పరవాడ: పరవాడ సంతబయలులోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు తినిపించారు. మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు పాల్గొన్నారు.

- దేశపాత్రునిపాలెంలోని పార్టీ కార్యాలయం వద్ద వైఎస్సార్ విగ్రహానికి పార్టీ సీనియర్ నాయకుడు కాసు అంజిరెడ్డి, రేబాక నరేష్, పండూరి రమణ, లక్కరాజు రాము పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- కలపాక సర్పంచ్ బొండా కనకారావు ఆధ్వర్యంలో మూడు రోడ్ల కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- గౌతులచ్చన్ననగర్ కూడలిలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు, పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గోపాలపట్నం, చంద్రనగర్ ప్రాంతవాసులకు శుభవార్త

తాటిచెట్లపాలెం: గోపాలపట్నం, చంద్రనగర్, సింహాచలం ప్రాంత ప్రజలకు వాల్తేర్ డివిజన్ శుభవార్త తెలిపింది. డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి అనితర కృషితో ఈ ప్రాంతంలో త్వరలోనే లిమిటెడ్ హైట్ సబ్‌వే ఏర్పాటుకానుంది. దీని ద్వారా సింహాచలం రైల్వేస్టేషన్‌కు అటు, ఇటు గ్రామాల ప్రజల కష్టాలు త్వరలోనే తీరనున్నాయి. ఈ ప్రాంతంలో గల లెవెల్ క్రాసింగ్ ఎప్పుడు మూసి ఉండడం, లేదా క్రాసింగ్స్ కింద నుంచి ట్రాక్స్ మీదుగా నిత్యం ప్రజలు రాకపోకలు సాగించడం జరుగుతుంది. దీనివల్ల అనేకసార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై ఇప్పటికే స్థానికులు, ప్రజాప్రతినిధులు డీఆర్ఎంకు వినతులు సమర్పించారు. ప్రస్తుత డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ ప్రాజెక్టుకు వెంటనే మంజూరు చేయించారు.

ఈస్ట్‌కోస్ట్‌రైల్వే ప్రధాన కార్యాలయం నుంచి అధికారికంగా ఈ ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఈ వివరాలను ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద గల ఎస్‌పీ–1,ఎస్ఎస్1 లెవెల్ క్రాసింగ్స్ వద్ద ఈ లిమిటెడ్ హైట్ సబ్‌వే రానుంది. కట్ అండ్ కర్వ్ పద్ధతిలో బాక్స్ కేస్టింగ్స్‌తో ఈ సబ్‌వేను ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన బాక్స్‌ల తయారీ ఇప్పటికే ప్రారంభమైందని డీఆర్ఎం తెలిపారు. ఈ సబ్‌వే నవంబరు నాటికి పూర్తి కావచ్చని పేర్కొన్నారు.

సవాళ్లను అధిగమించి ముందుకు..

- ఎన్టీపీసీ ప్రాజెక్ట్ హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా
- అట్టహాసంగా ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవం



ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవంలో కేక్‌కట్ చేస్తున్న ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా



రావాడలో సోలార్ వీధి దీపాలను ప్రారంభిస్తున్న ప్రాజెక్టు హెడ్ సిన్హా

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ అన్ని అడ్డంకులు, సవాళ్లను అధిగమించి అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతుందని సంస్థ ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ పరిపాలన భవనంలో శనివారం నిర్వహించిన సింహాద్రి ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన కేక్ కట్ చేసి ఎన్టీపీసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంస్థ పురోభివృద్ధిలో ఉత్తమ పనితీరును ప్రదర్శించిన సంస్థ ఉద్యోగులు, కార్మిక వర్గాలను సిన్హా ప్రత్యేకంగా అభినందించారు. అదే విధంగా 2022–23లో సింహాద్రి ఎన్టీపీసీ ఎంవోయూ లక్ష్యాలను సాధించినందుకు ప్రశంసించారు. 2023–24లో నిర్దేశించిన మైలురాయిని చేరుకునేందుకు ఉద్యోగులు నూతనోత్సాహంతో కష్టించి పని చేయాలని కోరారు. ఆవిర్భావ వేడుకల్లో భాగంగా స్వచ్ఛత పక్వాడా, అంతర్జాతీయ యోగా దినోత్సవ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

ల్యాబ్, వీధి దీపాలు ప్రారంభం

ఈ సందర్భంగా తానాం ఎంజేపీఏపీబీసీ పాఠశాలలో సంస్థ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ ల్యాబ్, వాడచీపురుపల్లి శివారు పోలిరెడ్డిపాలెం, రావాడలో సీఎస్సార్ నిధులు రూ.13.61 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 44 ఎల్‌ఈడీ సోలార్ దీపాలను సిన్హా ప్రారంభించారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించడానికి సంస్థ కృషి చేస్తుందని ఆయన చెప్పారు. సింహాద్రి ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎన్‌హెచ్ఏఐ బృందం తరఫున విజయవాడ ప్రాంతీయ అధికారి ఆర్.కె.సింగ్ సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సిన్హాను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భగా సింగ్ మాట్లాడుతూ జాతీయ రహదారి ప్రాజెక్టులకు నిరంతరం ఎన్టీపీసీ బూడిదను సరఫరా చేసి సకాలంలో అనేక రహదారులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో అమలు జరుగుతున్న ఎన్‌హెచ్ఏఐ రహదారి ప్రాజెక్టులకు సింహాద్రి ఎన్టీపీసీ 130 లక్షల మెట్రిక్‌టన్నుల కంటే ఎక్కువ బూడిద సరఫరా చేసిందని సింగ్ చెప్పారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేడుకల్లో వీపీజీ చీఫ్ జనరల్ మేనేజర్ బి.రామారావు, సీపీజీ–3 చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.గోవిందరాజన్, ఆపరేషన్ జీఎం డీపీ పాత్ర, దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూసిన్హా, హెచ్‌వో హెచ్‌ఆర్ రుమాడిశర్మ, సీఐఎస్ఎఫ్ డీసీ వి.కె.ప్రభాకర్, పలువురు ఉన్నతాధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమం భావి తరాలకు స్ఫూర్తి



877వ రోజు దీక్షశిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం చేస్తున్న ఉద్యమం భవిష్యత్తు తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 877వ రోజు శనివారం ఆర్ఎంహెచ్‌పీ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ రైతులు సాగించిన పోరాట ఫలితంగా మోదీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని, స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు అటువంటి పోరాటాలు చేయక తప్పదన్నారు. ఉక్కు నిర్వాసితులు చేసిన ప్రాణత్యాగాలను మోదీ ప్రభుత్వం గుర్తు చేసుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ఉత్పత్తిలో పరుగులు పెడుతూ దేశంలో నెంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందని, కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పలు రైళ్లు రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఆయా స్టేషన్లలో శనివారం పలు రైళ్లు ఆలస్యంగా బయల్దేరినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. హౌరా–సికింద్రాబాద్ (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, హౌరా–తిరుపతి (20889) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, హౌరా–ఎర్నాకుళం (22877) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్, షాలిమార్–చెన్నై సెంట్రల్ (12841) కోరమండల్ ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్ –షాలిమార్ (12842) కోరమండల్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–లోకమాన్యతిలక్ టెర్మినస్ (18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్ –హౌరా (12840) మెయిల్ ఎక్స్‌ప్రెస్, హౌరా–చెన్నై సెంట్రల్ (12839)మెయిల్ ఎక్స్‌ప్రెస్ ఆలస్యంగా బయలుదేరాయి.

‘అగ్రిగోల్డ్’కు వ్యతిరేకంగా చలో విజయవాడ

దాబాగార్డెన్స్ : అగ్రిగోల్డ్ యాజమాన్యం బినామీ ఆస్తులు విక్రయిస్తూ.. బినామీ కంపెనీలు పెడుతోందని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆరోపించారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం కస్టమర్లు, ఏజెంట్లను దారుణంగా మోసగించిందన్నారు. బాధితుల సమస్య పరిష్కారం కోసం ఆగస్టు 15 వరకు ప్రభుత్వానికి సమయం ఇస్తున్నామని, ఆలోగా సమస్యను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఆగస్టు 30న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, జనసేన పార్టీ నాయకుడు రఘు, నాయుడు, తిరుపతిరావు, కేఎం రావు, మంగరాజు, డాక్టర్ సీతల్, పాత్రుడు, కోటేశ్వరరావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.